క్లుప్తంగా

వైభవం.. నరసింహస్వామి కల్యాణం



శ్రీ దేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహ స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండలంలోని శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శ్రావణ ద్వాదశిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామి దివ్యశాంతి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం నంద్యాల పట్టణానికి మధుసూదన్ రెడ్డి సహకారంతో.. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కొలువుంచి, వేద మంత్రోచ్ఛరాణ నడుమ.. శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.

వెలుగు సీసీగా కృష్ణమూర్తి



కోవెలకుంట్ల: స్థానిక వెలుగు కార్యాలయంలో సీసీగా కృష్ణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీసీ వెంకటస్వామి బండిఆత్మకూరు మండలానికి బదిలీ కాగా ఆ స్థానంలో డోన్ వెలుగు కార్యాలయంలో సీసీగా పనిచేస్తున్న కృష్ణమూర్తిని ఇక్కడికి బదిలీ చేయడంతో ఆయన విధుల్లో చేరారు.

మేజర్ పంచాయతీ అభివృద్ధికి సహకారం



వార్డుమెంబర్లతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి గ్రామ పంచాయతీ పాలక వర్గం పూర్తి సహకారం అందిస్తుందని సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ పాలకవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలు, యుద్ధప్రాతిపాదికన చేపట్టాల్సిన పనులపై వార్డు సభ్యులతో చర్చించారు. వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే మేజర్ పంచాయతీ అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా గ్రామ పంచాయతీ అభివృద్ధికి తాము ఎల్లవేళలా కృషి చేస్తామన్నారు.

బెలుం గుహలను తిలకించిన డీఐజీ



గుహను సందర్శిస్తున్న డీఐజీ

కొలిమిగుండ్ల: బెలుం గుహలను బుధవారం డీఐజీ కోయ ప్రవీణ్ తిలకించారు. గుహల వద్దకు చేరుకోగానే యూనిట్ మేనేజర్ కిషోర్, సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గుహల లోపలికి వెళ్లి ప్రముఖ ప్రదేశాలను పరిశీలించారు. గుహలు ఏర్పడిన విధానం వాటి ప్రాముఖ్యత తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట స్థానిక సీఐ రమేష్‌బాబు పాల్గొన్నారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మెడికల్ ఆఫీసర్, సిబ్బంది

కొలిమిగుండ్ల: దోమలు వ్యాప్తి చెందకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కొలిమిగుండ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ హరిచరణ్‌రెడ్డి సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందితో కలిసి ర్యాలీగా ఉన్నత పాఠశాల వరకు చేరుకొని విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఇళ్లతో పాటు చుట్టు ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ పరమేశ్వరరెడ్డి, సూపర్‌వైజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు నిధుల మంజూరు

బనగానపల్లె : పట్టణంలోని పెట్రోల్‌బంకు కూడలి నుంచి గ్రామ పంచాయతీ మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు రూ.2 కోట్లతో సీసీ రోడ్డు డ్రైనేజీ ఏర్పాటుకు నాబార్డు నిధులు మంజూరైనట్లు పంచాయతీరాజ్ ప్రాజెక్టు డీఈఈ మన్మనధబాబు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు.

మట్టి ప్రతిమలు..పర్యావరణ హితం

- పీఓపీ విగ్రహాలు హానికరం
- ఆ విగ్రహాల నిమజ్జనంతో జలచరాలకు ముప్పు
- కలుషిత నీటిని తాగితే పలు వ్యాధులు వచ్చే అవకాశం



ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలు



మట్టి వినాయకులు

ప్యాపిలి: పూజల్లో ప్రథమ పూజ అందుకునే అధినాయకుడు గణనాథుడు. పల్లె, పట్టణం అని తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వయోబేధాన్ని మరచి ఉత్సవాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. ఈ నెల 27వ తేదీ నుంచి చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అయితే భారీగా వెలియనున్న వినాయక మంటపాల్లో అంతే భారీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అయితే.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన వినాయక విగ్రహాల కంటే మట్టి ప్రతిమలే పర్యావరణానికి మంచివని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

మట్టి గణపతిని పూజిస్తేనే ఫలితం..

భాద్రపద మాసం శుక్లపక్షం చతుర్థి రోజు జరుపుకునే వినాయకచవితి హిందువులకు ఎంతో విశిష్టమైనది. పురాణాల ప్రకారం గణేశుడు మట్టితో చేసిన ప్రతిమ రూపంలోనే దర్శనమిస్తాడు. మట్టి గణపతిని పూజించడం ద్వారా అనేక యుగాలు ఫలితాలు పొందుతారని పండితుల అభిప్రాయం. మట్టి గణపతి నుంచి పాజిటివ్ ఎనర్జీ లభిస్తుంది. మట్టితో చేసిన వినాయకుడిని పూజించడం ద్వారా పర్యావరణానికి మేలు చేయడమే కాకుండా పూజా ఫలం కూడా లభిస్తుందని పండితులు చెబుతున్నారు. మట్టి గణపతిని కాకుండా పసుపుతో కూడా గణేశుని ప్రతిమను తయారు చేసి పూజించవచ్చు. ప్రతిమ లేని వారు పసుపు ముద్దను గణపతిగా భావించి పూజించినా వినాయకుని కరుణ కటాక్షాలు లభిస్తాయని పేర్కొంటున్నారు.

రసాయనాలతో నీటి కాలుష్యం..

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలు త్వరగా నీటిలో కరుగవు. అలాగే ఆ రసాయనం ద్వారా నీటిలో నివసించే జీవులు మృత్యువాత పడతాయని పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. రసాయనా లతో కూడిన రంగులను వినియోగించడం వల్ల ఈ విగ్రహాలు నీటిలో కరగడం వల్ల ఆ నీటిని తాగితే శ్వాసకోశ ఇబ్బందులు, చర్మవ్యాధు లు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తాయంటున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాల కంటే మట్టితో చేసిన విగ్రహాలను పూజించి నిమజ్జనం చేయడమే ఉత్తమం.

మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేయాలి



వినాయక చవితిని పురస్కరించుకుని ఏర్పాటు చేసే విగ్రహాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. పురాణాల్లో చెప్పిన విషయాలను ప్రామాణికంగా తీసుకుంటే వినాయకుని కరుణ, కటాక్షం ప్రాప్తిస్తుంది. మట్టి వినాయకుడిని పూజించాలని పురాణాలు చెబుతున్నా పెడచెవిన పెట్టడం మంచిది కాదు. మట్టి విగ్రహాలు త్వరగా నీటిలో కరగడంతో పాటు పర్యావరణానికి మేలు చేస్తాయి. కాబట్టి వినాయకచవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజించాలి.

– రాచూరు కోదండపాణి, పురోహితులు, ప్యాపిలి

పర్యావరణానికి చేటు చేయొద్దు



వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడంలో అనవసరమైన ఆడంబరాలు చూపరాదు. భారీ విగ్రహాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగుల రసాయనాలతో చేసిన ఆకర్షణీయ విగ్రహాల ద్వారా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. రసాయనాలతో చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయడం ద్వారా జలచరాలు మృత్యువాత పడతాయి. చిన్న మట్టి విగ్రహం ఏర్పాటు చేసి చిత్తశుద్ధితో పూజించినా ఫలితం ఉంటుంది. పూజల పేరుతో ఇతర జీవరాసుల మనుగడకు హాని కలిగించడాన్ని శాస్త్రం ఒప్పుకోదు.

– చక్రపాణి, పూజారి, ప్యాపిలి

నీట్ పీజీలో అవుకు విద్యార్థిని ప్రతిభ



లక్ష్మీకీర్తనదేవి

అవుకు(కొలిమిగుండ్ల): 2025–26 విద్యాసంవత్సరానికి మెడికల్ పీజీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీలో అవుకు పట్టణానికి చెందిన విద్యార్థిని లక్ష్మీకీర్తనదేవి ప్రతిభ చాటింది. నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ విడుదల చేసిన ఫలితాల్లో ఆలిండియాలో 1185 ర్యాంకు సాధించింది. తండ్రి రామాపురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా, తల్లి స్థానికంగా ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్నారు. లక్ష్మీకీర్తనదేవి కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ పూర్తి చేసుకుంది.

‘దొంగ ఓట్లతోనే బీజేపీకి అధికారం’

డోన్ టౌన్ : కేంద్రంలో బీజేపీ దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు ఆరోపించారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్ళు అవుతున్నా ఏపీకి ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక హోదా ఇస్తామన్న హామీని నేటికీ నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా, కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతారని చెప్పారు. మోటా రాముడు,నారాయణ, రంగస్వామి,నాగరాజు ఉన్నారు.

రైతుల పక్షాన పోరాడుతాం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి రంగనాయుడు

కొలిమిగుండ్ల: సిమెంట్ ప్యాక్టరీల వల్ల రైతులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని, వారి పక్షాన నిలబడి చివరి వరకు పోరాటం సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగమనాయుడు అన్నారు. బుధవారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామ్‌కో సిమెంట్ ప్యాక్టరీ వల్ల చుట్టు పక్కల గ్రామాల రైతులు అన్యాయానికి గురవతున్నారని ఆరోపించారు. రైతులకు అండగా నిలబడి వారి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రామ్‌కో ప్యాక్టరీ ప్రతినిధుల వద్ద పది డిమాండ్లను ప్రతిపాదించామన్నారు. ఈనెల 26వ తేదిలోగా పరిష్కరించేందుకు ముందుకు రాక పోతే కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యయసాయ సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, మండల రైతు సంఘం కన్వీనర్ పుల్లయ్య, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, వినయ్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దద్దణాల జలాశయాన్ని నింపాలి

బనగానపల్లె రూరల్ : మండలంలోని మేజర్ ఇరిగేష్ ప్రాజెక్టు జుర్రేరు రిజర్వాయర్ (దద్దణాల ప్రాజెక్టు)ను ఎత్తిపోతల పథకం ద్వారా నింపేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా సెక్రటరీ రంగ నాయుడు కోరారు. బుధవారం మండలంలోని జ్వాలాపురం గ్రామ సమీపంలో ఉన్న దద్దణాల ప్రాజెక్టును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా అన్ని ప్రాజెక్టులు నిండి నీరంతా సముద్రం పాలవతున్నాయన్నారు. అయితే మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నియోజవర్గంలో ఉన్న జుర్రేరు ప్రాజెక్టులో ఇప్పటికి కూడా నీరు లేదన్నారు.

335 మంది దివ్యాంగుల పింఛన్ రద్దు



దరఖాస్తులు ఇచ్చేందుకు ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వేచివున్న దివ్యాంగులు

బనగానపల్లె రూరల్ : మండలంలో 335 మంది వివిధ రకాల దివ్యాంగుల పింఛన్ రద్దు చేసినట్లు ఎంపీడీఓ రాధిక బుధవారం తెలిపారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన దివ్యాంగ పింఛన్ల రీ వేరిఫికేషన్‌లో భాగంగా మండలంలో 405 మంది వివిధ రకాల దివ్యాంగులను వేరిఫికేషన్ చేయడం జరిగింది. ఇందులో 70 మందిని అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. కాగా రద్దు చేసిన వారిలో ఇంకా ఎవరైనా అర్హత కలిగిన వారు ఉంటే ఎంపీడీఓ కార్యాలయాని వచ్చి తమ దరఖాస్తులను అందజేయాలని సూచించారు. నడవలేని వారు, మానసిక వికలాంగులు, శాశ్వత పక్షవాత బాధితులు, పోలీయో వ్యాధి బాధితులు తమ దరఖాస్తులను కుటుంబ సభ్యులతో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి అందజేశారు.

పింఛన్ కోసం అప్పీల్

సంజామల: దివ్యంగుల పింఛన్ పొందుతున్న లబ్ధిదారులు, అనర్హుల జాబితాలో ఉన్న వ్యక్తులు ఆయా సచివాలయాల్లో అప్పీల్ చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామసుబ్బయ్య సూచించారు. మండలంలో 57 దివ్యాంగుల పింఛన్లు అనర్హుల జాబితాలో వచ్చాయన్నారు. వాటిలో అర్హులైనవారి పేర్లు ఉంటే ఆధార్, పింఛన్ రద్దు నోటీసు, పాత సదరం సర్టిఫికెట్, కొత్త సదరం సర్టిఫికెట్, పింఛన్‌దారుని ఆసుపత్రి రిపోర్ట్స్ జతపరిచి ఆయా గ్రామ సచివాలయంలో అందించాలన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బనగానపల్లె రూరల్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పి.వెంకటేష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత అధ్యక్షతన ప్రధాన మంత్రి– టీబీ ముక్త్ భారత్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక వందపడకల వైద్యశాల సివిల్ సర్జన్ డాక్టర్ పి.వెంకటేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దగ్గు, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి తగిన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, డీఓటీఎస్ చికిత్స ద్వారా పూర్తిగా కోలుకోవచ్చునని తెలిపారు. అనంతరం కళాశాల అధ్యాపకులు డాక్టర్ మహమ్మద్‌గౌస్ సిద్ధం చేసిన ఉచిత స్టడి మెటీరియల్‌ను విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత చేతుల మీదుగా అందజేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో టీబీ కో ఆర్డినేటర్ నరసింహ, కళాశాల అధ్యాపకులు బాబునాథ్, సూర్యనారాయణ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బడేసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

రోనాల్డ్ సేవలు చిరస్మరణీయం



రోనాల్డ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మలేరియాను కనుగొన్న శాస్త్రవేత్త సర్ రోనాల్డ్ రాస్ సేవలు చిరస్మరణీయమని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్, సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ అన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక 14వ సచివాలయంలో శాస్త్రవేత్త చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.సెక్రెటరీలు మద్దిలేటి, రమేష్, మంజులవాణి, ఏఎన్ఎం సుజాత ఉన్నారు.

దోమల నివారణపై అవగాహన



విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

డోన్ టౌన్ : ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం ర్యాలీలు నిర్వహించారు. కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో లక్ష్మంపల్లి గ్రామంలో దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి వివరించి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ రాంభూపాల్,హెల్త్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటలక్ష్మి ఉన్నారు. అలాగే.. డోన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో దోమల నివారణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ చేపట్టారు. సూపర్‌వైజర్ చెన్నయ్య,హెల్త్ అసిస్టెంట్స్ మధుసూదన్‌రావు,ఆనంద్,అమర్నాథ్ ఉన్నారు.

భూసార పరీక్షలతో లాభాలు

కొలిమిగుండ్ల: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల లాభాలు ఉన్నాయని నంద్యాల రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ చెన్నయ్య సూచించారు. బుధవారం నందిపాడులో రైతు సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు సాగు చేసే ముందు విత్తనాల ఎంపిక కీలకమన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వాడటం వల్ల లాభాలు ఉన్నాయని చెప్పారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి ప్రకృతి ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని సూచించారు. మొక్క జొన్న, వరి, వేరు శనగ తదితర పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వరెడ్డి, ఎంఏఓ ప్రసాద్, ఏఈఓ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీలను సందర్శించిన కమిషనర్



తాగునీటి సమస్యపై ఏఈ, వాటర్ మెన్‌తో చర్చిస్తున్న కమిషనర్ హరిప్రసాద్

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఎన్‌జీవోస్, తహసీల్దార్ కార్యాలయం ఏరియాల్లో నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఏఈ మధు తేజా రెడ్డి బుధవారం కలియతిరిగారు. ఆయా కాలనీల్లో ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి సమస్య ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకురాగా.. ఎన్నిరోజులకొకసారి నీటిని వదులుతున్నారు, సమస్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై వారితో చర్చించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. పట్టణ శివారులోని జ్యోతి స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న పరమేశ్వరరెడ్డి విధులు ముగించుకుని స్వగ్రామమైన ఉయ్యాలవాడ మండలం మాయలూరుకు బైక్‌పై బయలుదేరాడు. అదే సమయంలో బనగానపల్లె మండలం ఇల్లూరు కొత్తపేటకు చెందిన నరసింహులు కూరగాయల వ్యాపార నిమిత్తం ఉయ్యాలవాడకు వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నాడు. మండలంలోని పొట్టిపాడు మెట్ట సమీపంలో వీరిద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం కోవెలకుంట్లలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ఆవుల యజమానులకు నోటీసులు

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారులపై ఆవులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో ఆవుల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఈఓ ప్రకాష్‌నాయుడు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, గ్రామ పంచాయతీ సర్కిల్, జమ్మలమడుగు చౌరస్తా ప్రాంతాల్లో ఆవుల మందలుగా సంచరిస్తున్నాయన్నారు. ఆవుల సంచారంతో రాత్రి వేళల్లో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. గోవుల యజమానులు ఈ నెల 22వ తేదీలోపు ఆవులను సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లకపోతే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

గ్రామ పరిశుభ్రతకు సహకరించండి

బేతంచెర్ల: అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామ పరిశుభ్రతకు సహకరించాలని గూటుపల్లె సర్పంచ్ శ్రీరాములు అన్నారు. బుధవారం మండలంలోని గూటుపల్లె గ్రామ ఎస్సీ కాలనీలో మహిళల సౌకర్యార్థం రూ.7లక్షల మండల నిధులతో నిర్మించిన వెట్ లెట్రిన్‌ను వైస్ ఎంపీపీ రంగస్వామితో కలిసి ప్రారంభించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు



ఎల్లమ్మ పూజల్లో పాల్గొన్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు



గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హుసేనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ విగ్రహం పాటు గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామ సమీపాన బెల్లమల్లకుంట వద్ద పండితుల వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాలు, భక్త జనసందోహం నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గోరుమానుకొండ, గూటుపల్లె సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, వైస్ ఎంపీపీ రంగస్వామి,వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, ఆదాం వెంకటేశ్వర్‌రెడ్డి, రామచంద్రుడు, తిమ్మయ్య, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, పిట్టల జాకీర్, నాయకులు ఎద్దులన్న, వెంకట శివుడు హాజరై ప్రత్యేక పూజలు చేపట్టారు.

శ్రీకృష్ణుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత భక్తులు

కొలిమిగుండ్ల: ప్రబోధనందస్వామి ఆశీస్సులతో త్రైతసిద్ధాంత ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం కొలిమిగుండ్లలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక సాయిబాబా ఆలయం ఎదురుగా శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు భక్తులకు అన్నదానం నిర్వహించారు. మేళతాళాలు, కోలాట కళాకారుల ప్రదర్శన మధ్య పూలతో అందంగా అలంకరించిన ప్రత్యేక పల్లకీలో శ్రీకృష్ణుడిని కొలువుంచి వీధుల గుండా గ్రామోత్సవం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంజీవ్‌బాబు, హరికృష్ణ, అశోక్, ఓబులేసు, కుమార్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

బార్ లైసెన్స్‌కు గీత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

డోన్ టౌన్ : పట్టణంలో గీత కులాల (ఈడిగ)కు రిజర్వేషన్ కింద కొత్త బార్ ఏర్పాటుకు గెజిట్ జారీ అయ్యిందని నంద్యాల జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రోహిబిషనరీ అధికారి రవికుమార్, డోన్ ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, నంద్యాల సీఐ లక్ష్మణదాస్ బుధవారం తెలిపారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ లైసెన్స్ మూడేళ్ల కాలపరిమితితో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బార్‌కు దరఖాస్తు చేసుకోదలచిన వారు రూ.5లక్షలు నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించి,ఈ నెల 20 నుంచి 29వ తేదీ సాయంత్రం లోపు అన్‌లైన్ లేదా అఫ్ లైన్‌లో దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. అందిన దరఖాస్తులను 30వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నంద్యాల కలెక్టర్ ఆఫీసులో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు బార్ లైసెన్సుకు మొదటి సంవత్సరం ఫీజు రూ.27.50లక్షలు, రెండో సంవత్సరం రూ.30.25లక్షలు, మూడో సంవత్సరం రూ. 33,27,500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే నియోజకవర్గంలోని డోన్ పట్టణానికి ఒక బారు, బేతంచెర్ల నగర పంచాయితీకి ఒక బార్‌ను ఓపెన్ కేటగిరీ అనుమతులిచ్చారని చెప్పారు. ఓపెన్ కేటగిరీ బార్లకు దరఖాస్తు చేసుకోదలచిన వారు నాన్ రీఫండబుల్ అప్లికేషన్ ఫీజు రూ.5లక్షలు చెల్లించి ఈ నెల 18 నుంచి 26వ తేదీ సాయంత్రంలోపు అన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అందిన దరఖాస్తులను 28న నంద్యాలలోని జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన అర్హులను ఎంపిక చేస్తారన్నారు. లాటరీలో ఎంపికైన వారు లైసెన్స్ ఫీజు కింద డోన్ పట్టణానికి మొదటి సంవత్సరం రూ.55 లక్షలు, బేతంచెర్లకు రూ.35 లక్షలు, రెండో సంవత్సరం డోన్ రూ.60.50 లక్షలు, బేతంచెర్ల రూ.38.50 లక్షలు, మూడో సంవత్సరం డోన్ రూ.66.55 లక్షలు, బేతంచెర్ల రూ.42.35 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు డోన్ ఎక్సైజ్ స్టేషన్ లేదా 9440902584 సెల్ నంబరులో సంప్రదించాలని కోరారు. ఎస్ఐ సోమశేఖర్‌రావు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు





కోవెలకుంట్ల- అవుకు ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

కోవెలకుంట్ల: పట్టుమని పదినెలలు కాకముందే ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ నుంచి వివిధ ప్రాంతాలకు గతేడాది చివరల్లో వేసిన రోడ్లు పలుచోట్ల పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. కోవెలకుంట్ల– అవుకు ఆర్‌అండ్‌బీ రహదారిలో స్థానిక ముదిగేడు చౌరస్తా నుంచి రోడ్డు దెబ్బతిని పెద్ద పెద్ద గుంతలతో దర్శనమిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో శిథిలమైన రోడ్డు గుంతల్లో వర్షపునీరు చేరడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్న పాటి వర్షాలకే రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహన చోదకులు దెబ్బతిన్న రోడ్డు ప్రాంతాన్ని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కోవెలకుంట్ల– గుంజలపాడు ఆర్‌అండ్‌బీ రహదారిలో రోడ్డు గుంతలమయంగా మారటంతో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.